క్లుప్తంగా

ఒకటి నుంచి సదరం స్లాట్లు

మాడుగుల రూరల్: దివ్యాంగులకు సదరం ధ్రువపత్రాలు జారీ కోసం వచ్చే నెల ఒకటో తేదీ నుంచి సదరం స్లాట్ల బుకింగ్ పునః ప్రారంభం కానున్నట్టు ఎంపీడీవో కె.అప్పారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సామాజిక పింఛన్ల తనిఖీలో భాగంగా కొంత కాలంగా నిలిపివేసిన సదరం స్లాట్లను సచివాలయాల్లో వచ్చేనెల ఒకటో తేదీ నుంచి ఓపెన్ అవుతాయన్నారు. ఎంపిక చేసిన ఏరియా, జిల్లా, టీచింగ్ ఆస్పత్రులు, జీజీహెచ్‌లలో ప్రతి మంగళవారం దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించి, అర్హులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారన్నారు.

బుచ్చెయ్యపేటలో నేడు సామాజిక తనిఖీ గ్రామసభ

బుచ్చెయ్యపేట: బుచ్చెయ్యపేట మండలం ఉపాధి హామీ పథకం 17వ సామాజిక తనిఖీ ప్రజావేదిక గ్రామసభ శనివారం నిర్వహించనున్నట్టు ఏపీవో వరహాలబాబు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు జరిగే గ్రామసభకు అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వీఆర్పీలు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, మండల ఇంజినీర్ అధికారులు హాజరుకావాలన్నారు.

మర్రిపాలెం కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నాతవరం: మర్రిపాలెం కేజీబీవీలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె.భవాని తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీలో 49 సీట్లు, 6వ తరగతిలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. 7, 8, 9, 10వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం కూడా ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వచ్చేనెల 11వ తేదీ సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 96668 01458, 95054 55172 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

కింతలి ఉప సర్పంచ్‌గా నారాయణరావు ఏకగ్రీవం

మాడుగుల రూరల్: కింతలి గ్రామ ఉప సర్పంచ్‌గా అప్పాన నారాయణరావును వార్డు సభ్యులు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. షెడ్యూల్ ప్రకారం ఈ ఎన్నిక గురువారం జరగాల్సి ఉండగా, అనివార్య కారణాలు వల్ల శుక్రవారానికి వాయిదా వేశారు. ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి పి.విజయలక్ష్మి శుక్రవారం ఉదయం పంచాయతీ కార్యాలయంలో ఎన్నిక నిర్వహించారు. 8 మంది వార్డు సభ్యులు ఉండగా.. అప్పాన నారాయణరావుకు ఆరుగురు వార్డు సభ్యులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మైచర్ల భవానీ, ఎంపీటీసీ సభ్యులు మైచర్ల సన్యాసిరావు, పంచాయతీ కార్యదర్శి, పోలీసులు పాల్గొన్నారు. ఉప సర్పంచ్ నారాయణరావును స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులతో పాటు స్థానిక నాయకుడు సుంకర శ్రీనివాసరావు, తదితరులు అభినందించి, సత్కరించారు.

'కాటపల్లి'కి అంబేడ్కర్ సేవారత్న అవార్డు


కాటపల్లి అప్పారావు

దేవరాపల్లి: స్థానిక దళిత నాయకుడు కాటపల్లి అప్పారావు రాష్ట్ర స్థాయి అంబేడ్కర్ సేవారత్న అవార్డుకు ఎంపికయ్యారు. 30 ఏళ్లగా అంబేడ్కర్ ఆశయ సాధనే ధ్యేయంగా పనిచేసి, సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడుతూ విశేష సేవలందిస్తున్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అంబేడ్కర్ సేవారత్న అవార్డును ప్రకటించింది. ఈ అవార్డును ఈ నెల 30న ఒంగోలులో బీఆర్ అంబేడ్కర్ ఉగాది పురస్కారాలు మహోత్సవంలో అందజేయనున్నారు.

సందడిగా ముందస్తు ఉగాది వేడుక


ఓ పాఠశాలలో సంప్రదాయ వేషధారణలో విద్యార్థులు

కె.కోటపాడు : మండల కేంద్రం కె.కోటపాడులోని ఓ పాఠశాలలో ముందస్తు విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మామిడి తోరణాలతో పాటు పూలను అలంకరించి తెలుగు కొత్త సంవత్సరానికి విద్యార్థులు ఆహ్వానం పలికారు. సంప్రదాయ వేషధారణలో భాగంగా విద్యార్థి, విద్యార్థినులు పంచి కట్టు, చీరలతో ఆకట్టుకున్నారు.

పంచాయతీ కార్యదర్శి లింగన్నకు ఘన సత్కారం

దేవరాపల్లి: ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న పంచాయతీ కార్యదర్శి లెక్కల లింగన్నను తామరబ్బలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. గతంలో తామరబ్బ సెక్రటరీగా పని చేసిన లింగన్న, ప్రస్తుతం ముషిడిపల్లి సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తున్నారు. లింగన్న దంపతులను స్థానిక సర్పంచ్ టోకురి రామకృష్ణ, ఉప సర్పంచ్ గుమ్మడపు దేవి మహేష్ తదితర స్థానిక నాయకులు, ప్రజలు ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

పశు వైద్యం.. దైవాదీనం.!

దేవరాపల్లి పశువైద్య శాల




దేవరాపల్లి పశు వైద్యశాలలో పశువైద్యాధికారి లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీ

- దేవరాపల్లిలో 8 నెలలుగా పశువైద్యాధికారి పోస్టు ఖాళీ
- స్థానిక పశు వైద్య సిబ్బందితో అరకొర వైద్య సేవలు
- 9 గ్రామాల పాడి రైతులకు తప్పని అవస్థలు


వైద్య సేవలందిస్తున్న పశువైద్య సిబ్బంది

దేవరాపల్లి: పశు వైద్యం పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చి సుమారు 10 నెలలు కావస్తున్నా దేవరాపల్లి పశువుల ఆస్పత్రికి వైద్యాధికారిని నియమించకపోవడమే ఇందుకు నిదర్శనం. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పాడి రైతుల చెంతకే వెళ్లి పశు వైద్యం అందించాలన్న సంకల్పంతో ఏర్పాటు చేసిన సంచార పశు వైద్య వాహనాలను కూటమి ప్రభుత్వం నిలిపివేయడంతో ఇప్పటికే పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అత్యంత ప్రాధాన్యత కలిగిన మండల కేంద్రం దేవరాపల్లి పశువుల ఆస్పత్రిలో సుమారు 8 నెలలుగా పశు వైద్యాధికారి లేకపోయినా పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. వైద్యాధికారి అందుబాటులో లేకపోవడంతో పశు వైద్యం అందని ద్రాక్షగా మారింది. ఇక్కడ పశువైద్యాధికారిగా పని చేసిన ఎస్.అలేఖ్య డిప్యుటేషన్‌పై వేరొక చోటకు వెళ్లిపోయారు. ఇన్‌చార్జ్ పశువైద్యాధికారిగా ఎం.అలమండ పశు వైద్యాధికారి కె.మంజుషరాణిని నియమించారు. అయితే ఆమె ఎం.అలమండలో విధులు నిర్వర్తించాల్సి ఉండటంతో రోజూ దేవరాపల్లి వచ్చే పరిస్థితి లేదు. దీంతో స్థానిక ఆస్పత్రిలో సిబ్బందే పెద్ద దిక్కుగా నిలుస్తున్నారు. ఈ ఆస్పత్రిలో ప్రతి రోజూ 50 పశువులు, మరో 50 వరకు గొర్రెలు, మేకలు, కుక్కలు, కోళ్లు, ఇతర పెంపుడు జంతువులకు వైద్య సేవలందిస్తారు. దేవరాపల్లి పశువైద్య శాల పరిధిలో రైవాడ, తెనుగుపూడి, గరిశింగి, వాకపల్లి, వెంకటరాజుపురం, వాలాబు, నాగయ్యపేట, మారేపల్లి గ్రామాల పాడి రైతులు ఆధారపడి ఉన్నారు. సుమారు 5 వేలు ఆవులు, గేదెలు, 8 వేలు గొర్రెలు, మేకలు ఉన్నాయి. వైద్యాధికారి లేకపోవడంతో ఆస్పత్రిలో విత్తులు కొట్టుట, తోకలు కత్తిరించుట, ప్రసవ సమయంలో ఆపరేషన్లు, కొమ్ము ఆపరేషన్లు చేయలేని పరిస్థితి నెలకొంది.

ఇబ్బందులు వాస్తవమే..



గతంలో ఇక్కడ పని చేసిన వైద్యాధికారి డిప్యుటేషన్‌పై వెళ్లిపోవడంతో ఉన్నతాధికారులు నాకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. పూర్తి స్థాయిలో వైద్యాధికారి లేకపోవడం కొంత మేర ఇబ్బందులు వాస్తవమే. ఆస్పత్రిలో పశువైద్య సహాయకులు వైద్య సేవలందిస్తున్నారు. మేలో జరిగే సాధారణ బదిలీల్లో పూర్తి స్థాయి వైద్యాధికారిని నియమించే అవకాశం ఉంది. – కె.మంజుషరాణి, ఇన్‌చార్జ్ పశువైద్యాధికారి, దేవరాపల్లి

ఫలించని కూటమి కుతంత్రాలు

- ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే పైచేయి
- పార్టీ మరింత బలోపేతానికి కృషి
- ఎంపీపీ శ్రీనివాసరావు


వైస్ ఎంపీపీలతో ఉప ఎన్నిక ఫలితాలపై ఆనందం పంచుకుంటున్న ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు

రోలుగుంట: జిల్లాలో ఎంపీపీ, వైస్ ఎంపీపీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో కూటమి కుతంత్రాలు ఫలించలేదని ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జిల్లాలో జరిగిన ఉప ఎన్నికలు ఆరింటిలో ఎంపీపీ నాలుగు స్థానాలు, వైస్ ఎంపీపీ ఒక స్థానం వెరసి అయిదు స్థానాలు వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. శుక్రవారం ఆయన జెడ్పీటీసీ పోతల లక్ష్మీ రమణమ్మ, వైస్ ఎంపీపీ కొల్లు సన్యాసినాయుడు, పార్టీ మండల శాఖ యువజన విభాగం అధ్యక్షుడు దోసపల్లి రాజుతో మండల పరిషత్ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఫలితాలు, పార్టీ అభివృద్ధి, కృషిపై మాట్లాడారు. ఉప ఎన్నికల ఫలితాలు కూటమికి చెంప దెబ్బ అన్నారు. ఈ ఫలితాలు తమ నాయకుడు మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి విశ్వసనీయతకే దక్కుతాయన్నారు. పార్టీ అభివృద్ధికి మండల నాయకులతో కలిసి మరింత కృషి చేస్తానని ఆయన చెప్పారు.

భూసమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపండి


తహసీల్దార్ కిషోర్ లింకన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీడికాడ: మండలంలోని భూసమస్యలపై పార్టీలకతీతంగా ప్రత్యేక దృష్టి పెట్టి రైతులకు అండగా నిలవాలని ఎంపీపీ కురచా జయమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు కోరారు. మండల తహసీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎం.కిషోర్ లింకన్‌ను శుక్రవారం మండలంలోని పార్టీ నేతలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనువాసరావు, పార్టీ నాయకుడు కురచా నారాయణమూర్తి, వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతి కొండబాబు, పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు గొల్లవిల్లి స్వామినాయుడు, పరువాడ మహేష్, లాలం శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోరు ఏర్పాటు


టి.అర్జాపురంలో బోరు పనులు ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ మత్స భవానీ ప్రసాద్, నాయకులు

రావికమతం: మండలంలో టి.అర్జాపురం పంచాయతీ మత్స వారి పాకల వద్ద మండల పరిషత్ నిధులతో తాగునీటి బోరు ఏర్పాటు చేస్తున్నట్లు వైస్ ఎంపీపీ భవానీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు రాజాన రామునాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అద్దిపల్లి రమేష్‌నాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అప్పలనాయుడు, మరిశా రమణ, గ్రామ నాయకులు గూటాల చిన్న, సీతిని శివ పాల్గొన్నారు.

టీబీ ముక్త పంచాయతీలుగా కె.జె.పురం, మాడుగుల ఎంపిక


మాడుగుల పంచాయతీ ఈవో మూర్తిబాబుకు అవార్డు అందిస్తున్న టీబీ సూపర్‌వైజర్ ఈశ్వరరావు

మాడుగుల రూరల్: టీబీ ముక్త పంచాయతీలుగా మాడుగుల, కె.జె.పురం గ్రామాలు ఎంపికయ్యాయని కె.జె.పురం పీహెచ్‌సీ టీబీ విభాగ సూపర్‌వైజరు కె.ఈశ్వరరావు తెలిపారు. ఈ మేరకు మాడుగుల, కె.జె.పురం గ్రామాలకు టీబీ ముక్త పంచాయతీ అవార్డులను శుక్రవారం మాడుగుల పంచాయతీ కార్యనిర్వహణాధికారి కె.మూర్తిబాబు, కె.జె.పురం పంచాయతీ కార్యదర్శి నవీన్‌దొరకు సూపర్‌వైజరు ఈశ్వరరావు అందజేశారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, వైద్య సిబ్బంది, ఇంటింటికి వెళ్లి టీబీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా ఆరోగ్య కార్యకర్తలు పైడితల్లమ్మ, సుగుణకుమారి, హేమలత, వరలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు భవానీ, శ్రీలత, భార్గవి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు


చీడికాడ ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎస్‌బీఐ సిబ్బంది

మాకవరపాలెం: కార్పొరేషన్ రుణాలకు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 220 మంది హాజరయ్యారు. మండలానికి వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణాలు అందజేసేందుకు 119 యూనిట్లు మంజూరయ్యాయి. ఇందు కోసం 420 మంది దరఖాస్తు చేశారు. వారికి శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించగా.. 220 మంది హాజరయ్యారని ఎంపీడీవో సీతామహాలక్ష్మి తెలిపారు. మండలంలో ఉన్న ఐదు బ్యాంకుల అధికారులు అభ్యర్థులను ఇంటర్వ్యూలు చేశారు.

చీడికాడ: చీడికాడ ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన బీసీ కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలకు దరఖాస్తుదారులు భారీగా తరలివచ్చారు. మండలానికి 63 యూనిట్లు మంజూరు కాగా.. 727 దరఖాస్తులు అందినట్లు ఎంపీడీవో హేమసుందరరావు తెలిపారు. ఎస్‌బీఐ, కెనరా బ్యాంకు, గ్రామీణ బ్యాంకు, యూనియన్ బ్యాంకుల అధికారులు దరఖాస్తుదారుల ధ్రువ పత్రాలను పరిశీలించారు.

మాడుగుల: కార్పొరేషన్ రుణాలకు కోసం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలను ఎంపీపీ తాళ్ళపురెడ్డి వెంకట రాజారామ్, ఎంపీడీవో కొంకి అప్పారావు ప్రారంభించారు. మండలంలో 29 పంచాయతీల నుంచి 480 మంది దరఖాస్తు చేయగా.. 336 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్టు ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు.

అందరి సహకారంతోనే స్వచ్ఛ గ్రామాలు


ర్యాలీ నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి సురేష్‌బాబు, పారిశుధ్య సిబ్బంది, క్లాప్ మిత్రలు

కె.కోటపాడు : అందరి సహకారంతోనే స్వచ్ఛ గ్రామాలు సాధ్యమని చౌడువాడ పంచాయతీ కార్యదర్శి బి.సురేష్‌బాబు అన్నారు. మాడుగుల నియోజకవర్గం నాలుగు మండలాల్లోని పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య సిబ్బంది, క్లాప్‌మిత్రలకు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై నాలుగు రోజులుగా ఇస్తున్న శిక్షణ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా గ్రామంలో పారిశుధ్య సిబ్బంది, క్లాప్‌మిత్రలతో ర్యాలీ నిర్వహించారు. తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేరువేరు డస్ట్‌బిన్‌లలో వేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని సురేష్‌బాబు వివరించారు.

నేటి నుంచి చోడవరం నూకాలమ్మ జాతర


విద్యుత్ అలంకరణలో చోడవరం నూకాలమ్మ అమ్మవారి ఆలయం

చోడవరం: చోడవరం నూకాలమ్మ అమ్మవారి కొత్త అమావాస్య జాతర శనివారం నుంచి జరగనుంది. ఈ మేరకు భారీ ఏర్పాట్లు చేశారు. ఈ జాతర నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నారు. అదే విధంగా ఈ నెల 29 నుంచి ఏప్రిల్ 29వ తేదీ వరకు నెల రోజుల పాటు గంధ అమావాస్య పండగ వరకు జాతర మహోత్సవం జరుగుతుంది. శనివారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి జాతర ప్రారంభిస్తారు. కొత్త అమావాస్య ఉత్సవం జరిగే నాలుగు రోజుల్లో ప్రతి రోజూ అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు గరగల ఉత్సవం, మొక్కులు చెల్లించుకునేందుకు ఆలయ ప్రాంగణంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని ప్రత్యేక విద్యుత్ సెట్లతో అలంకరణ చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. వెంకన్నపాలెం, గౌరీపట్నం, దామునాపల్లి, లక్ష్మీపురం గ్రామాల్లో కొలువైన నూకాంబిక అమ్మవారి జాతర కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

బ్యాంక్ రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

కె.కోటపాడు : డ్వాక్రా మహిళలు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని వెలుగు ఏపీఎం చిన బాబు కోరారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం వార్షిక రుణ, జీవనోపాధి ప్రణాళిక కార్యక్రమంపై వీవోఏలు, ఎన్యుమరేటర్‌లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఒక్కో ఎన్యుమరేటర్ ఐదు డ్వాక్రా సంఘాల్లోని మహిళలు ఇప్పటి వరకూ బ్యాంక్ లింకేజీ రుణాలు, స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్ నిధులతో ఏ విధంగా అభివృద్ధి చెందారో గుర్తించాలని ఏపీఎం సూచించారు. 2025–26 ఏడాదిలో ఏ విధమైన వ్యాపారాలు, ఇతర రంగాల్లో వారు రాణించేందుకు లక్ష్యాలను ఏర్పాటు చేసుకున్నారో తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు రొంగలి యశోధ, సీసీలు ఆర్.సురేష్, వెంకటరావు, సన్యాసినాయుడు, సింహాచలంనాయుడు, ఉమామహేశ్వరి, సత్యనారాయణ పాల్గొన్నారు.

కరుణించమ్మా.. నూకాలమ్మా..


నర్సీపట్నంలో నూకాంబిక అమ్మవారు


కె.జె.పురం నూకాంబిక అమ్మవారు


ఎం.అలమండలో నూకాలమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న సర్పంచ్ దాడి జగన్, భక్తులు


రోలుగుంటలో ఆలయం వద్ద భక్తుల దర్శనం కోసం ప్రతిష్టించిన అమ్మవారి పాదాలు


కేపీ అగ్రహారంలో ఎద్దుల బళ్ల పరుగు పోటీలు


నర్సీపట్నంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న వాసవీ కల్యాణ మండపం సంఘం ప్రతినిధులు

బుచ్చెయ్యపేట: భక్తుల కోర్కెలు తీర్చే నూకాలమ్మతల్లి పండగను శుక్రవారం పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. బుచ్చెయ్యపేట మండలం కేపీ అగ్రహారంలో నూకాలతల్లి పండగ సందర్భంగా గ్రామస్తులు శుక్రవారం తెల్లవారుజాము నుంచి అమ్మవారి ఆలయం వద్ద బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. భారీ మందుగుండు సామగ్రి కాల్చివేత, నేల డ్యాన్స్‌లు, తప్పెటగుళ్లు, కోలాటాల ప్రదర్శన మధ్యన అమ్మవారి సంబరం వైభవంగా సాగింది. సాయంత్రం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఎద్దుల పరుగు పందేలు ఆకట్టుకున్నాయి. జిల్లా స్థాయి కోలాటాలు, ఎద్దుల పరుగు పందెంలో గెలిపొందిన విజేతలకు ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు బహుమతులు అందించారు. రాత్రికి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తుల్ని అలరించాయి. పెదపూడి నూకాలతల్లి పండగ సందర్భంగా ముందు రోజే గ్రామస్తులు పూజలు నిర్వహించారు.

జిల్లేడుపూడిలో భక్తుల సందడి

నాతవరం: జిల్లేడుపూడి గ్రామంలో కొలువైన నూకాలమ్మతల్లి పండగ ప్రతి ఏటా కొత్త అమావాస్యకు చేయడం ఆనవాయితీ. కొత్త అమావాస్య శనివారం కావడంతో చాలా మంది భక్తులు శుక్రవారమే అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకమ, జాకెట్ ముక్క సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం రాత్రి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో బాణసంచా వెలుగులు ఆకట్టుకున్నాయి. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నేడు కె.జె.పురంలో పండగ

మాడుగుల రూరల్: కొత్త అమావాస్యను పురస్కరించుకుని మండలంలో కె.జె.పురం చెరకు కాటా ఆవరణలో నూకాంబిక అమ్మవారి పండగ శనివారం జరగనుంది. పండగ సందర్భంగా ఆలయం వద్ద చలువ పందిర్లు వేశారు. వారం రోజులుగా సతకంపట్టు వద్ద నుంచి ప్రతి రోజు రాత్రి ఘటాలు ఊరేగిస్తున్నారు. అమ్మవారికి శనివారం ఉదయం నుంచి పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. అలాగే మాడుగులలోని నూకాంబిక ఆలయంలో కూడా ఉదయం నుంచి పూజలు నిర్వహించనున్నారు. ముకుందపురంలో అమ్మవారి పూజలు నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

రోలుగుంటలో ప్రత్యేక ఏర్పాట్లు

రోలుగుంట: రోలుగుంటలో నూకాంబిక అమ్మవారి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం అమ్మవారి ఆలయం నిర్మాణ దశలో ఉంది. శనివారం జరగనున్న ఉత్సవంలో భాగంగా దర్శనానికి వచ్చే భక్తుల కోసం అమ్మవారి పాదాలను ప్రతిష్టించారు. అమ్మవారి కీర్తనలు, ఆటల పోటీలు నిర్వహించనున్నారు. పోటీల్లో పాల్గొనే భక్తులు ప్రవేశ రుసుం చెల్లించాల్సి ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు.

జిల్లా స్థాయి ఎడ్ల పోటీల విజేతగా 'కలగాడ'

దేవరాపల్లి: ఎం.అలమండలో నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరను ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తజనం దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. స్థానిక సర్పంచ్ దాడి జగన్ దంపతులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం నిర్వహించిన జిల్లా స్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శనలు హోరాహోరీగా సాగాయి. ఎడ్ల పోటీలలో కలగాడకు చెందిన పొలపర్తి రామునాయుడు ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. లెక్కలవానిపాలెం శ్రీపైడితల్లమ్మ ఎడ్లు ద్వితీయ స్థానంలోను, వల్లంపూడి శ్రీసిద్ధి వినాయక ఎడ్ల తృతీయ స్థానంలోను, బి.కొత్తూరు మురుగుతి శంకరరావు ఎడ్లు నాలుగో స్థానంలోను, వావిలపాడు గండి వెంకటరావు ఎడ్లు ఐదో స్థానంలో నిలిచాయి. ప్రథమ స్థానంలో నిలిచిన ఎడ్లకు తులం బంగారం, ఆ తర్వాతి స్థానాలలో నిలిచిన వారికి రూ. 16 వేలు, రూ. 13 వేలు, రూ.10వేలు, రూ. 8వేలు, రూ. 6వేలు, రూ. 5వేలు, రూ. 4వేలు, రూ.3వేలు, రూ.2వేలు, రూ. 1500, రూ.1000 వెయ్యి చొప్పున నగదు బహుమతులను గ్రామ పెద్దలు అందజేశారు. అనంతరం సాయంత్రం మహిళల కోలాట ప్రదర్శన, రాత్రి నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

నర్సీపట్నం: నర్సీపట్నం విలవేల్పు నూకాంబిక అమ్మవారి పండగను పట్టణ ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. అమ్మవారి దర్శనానికి వేకువజాము నుండే అబీద్‌సెంటర్‌లోని అమ్మవారి ఆలయం వద్ద బారులు తీరారు. రాత్రి వరకు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పసుపు, కుంకములను సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ అధికారులు ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేసి, ఎండ బారిన పడకుండా టెంట్లు వేశారు. గరగల ఊరేగింపు పట్టణ పురవీధుల్లో కొనసాగింది. అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ట్రైనీ డీఎస్పీ చైతన్య, పట్టణ సీఐ గోవిందరావు పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు. వాసవీ కల్యాణ మండప సంఘం ప్రతినిధులు భక్తులకు మజ్జిగ, గ్లూకోజ్ వాటర్ పంపిణీ చేశారు.

ఘనంగా అమ్మవార్ల ఆలయ వార్షికోత్సవం


మరిడిమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

కె.కోటపాడు : చౌడువాడ గ్రామంలో కొలువుదీరిన మరిడిమాంబ, బంగారమ్మ అమ్మవార్ల ఆలయ తృతీయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ప్రత్యేక ప్రజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందేలు నిర్వహించి, విజేతగా నిలిచిన ఎడ్ల యజమానులకు నగదు పురస్కారాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు శిలపరశెట్టి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి సత్కారం


వైద్య సిబ్బందిని సత్కరిస్తున్న ఎంపీపీ జయమ్మ, ఎంపీడీవో

చీడికాడ: పెదగోగాడ పీహెచ్‌సీ పరిధిలోని రెండు గ్రామాల్లో క్షయ నిర్మూలనకు కృషి చేసిన వైద్య సిబ్బందిని ఎంపీపీ కురచా జయమ్మ సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెదగోగాడ, అడవి అగ్రహారం గ్రామాల్లో ఒక్క టీబీ కేసు కూడా నమోదు కాకుండా నిరంతరం ప్రజలకు వ్యాధి పట్ల అవగాహన కల్పించారన్నారు. అన్ని గ్రామాలను క్షయ రహిత గ్రామాలుగా మార్చాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆయా గ్రామాల ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు పూల మొక్కలు, ప్రశంసా పత్రాలు అందించి సత్కరించారు.

చురుగ్గా వడ్డాది-తాటిపర్తి రహదారి పనులు


సీసీ రోడ్డు పనులు పర్యవేక్షిస్తున్న ఆర్‌అండ్‌బీ జేఈ సాయిశ్రీనివాస్, దేముడునాయుడు

మాడుగుల రూరల్: వడ్డాది నుంచి తాటిపర్తి వరకు రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. సుమారు 13 కి.మీ. రహదారి నిర్మాణానికి ఎన్‌డీబీ నిధులు రూ. 23.59 కోట్లు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరయ్యాయి. అప్పట్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల రోడ్డు పనులు చేపట్టలేదు. ప్రస్తుతం అదే కాంట్రాక్టర్ ఈ పనులు చేపట్టారు. ప్రస్తుతం రహదారి 7 మీటర్ల వెడల్పున పనులు చేపట్టామని ఆర్‌అండ్‌బీ జేఈ సాయి శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. కె.జె.పురం జంక్షన్‌లో 150 మీటర్లు పొడవున జరుగుతున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను ఆయన వర్క్ ఇన్‌స్పెక్టర్ పి.దేముడునాయుడుతో కలిసి పర్యవేక్షించారు. ఎం.కోటపాడు గ్రామం వద్ద 430 మీటర్ల పొడవున సిమెంటు రోడ్డు నిర్మిస్తామని ఆయన తెలిపారు. వడ్డాది నుంచి తాటపర్తి వరకు 15 కల్వర్టులు నిర్మించాల్సి ఉందన్నారు. ఇప్పటికే ఆరు కల్వర్టుల నిర్మాణం చేపట్టామన్నారు.